
నూరేళ్ళ తెలుగు కథకు

**నవ్య నీరాజనం - 86**

నూరేళ్ళ తెలుగు కథకు



# కథంటే సంస్కారాన్ని పెంచాలి

- వేదగిరి రాంబాబు

అక్షరానికి అణుశక్తి ఉందని, అది సమాజ హితానికి ఉపయోగపడాలని దృఢంగా విశ్వసించిన కథా రచయిత వేదగిరి రాంబాబు. నాలుగు దశాబ్దాల సాహితీ జీవనంలో విస్తారమైన సేద్యం చేసి గురజాడ అడుగులకు మడుగులొత్తి,'శ్రీపాద' పూజచేసి తరించారు. అట్టడుగు-దుర్భర జీవిత యదార్థ గాథలను శోధించి 'సందులు' గెలుచుకున్న రచయిత,దర్శకనిర్మాత. జైలు గోడల మధ్య కుమిలిపోయే జీవుల వేదనను అక్షరబద్ధం చేసిన సృజనశీలిగా **400** కథానికలు వ్రాయడమే కాక, కథంటే సంస్కారాన్ని పెంచాలని ఆకాంక్షించే ఈ వైవిధ్య ప్రయోగశీలితో ఈ వారం...



## కుటుంబం

గుంటూరు జిల్లా చుండూరులో 1952 అక్టోబరు 14న పుట్టాను. భార్గవి, పూర్ణచంద్రరావుగారలు మా అమ్మా నాన్నలు. ముగ్గురు అన్నయ్యలు, ఇద్దరు తమ్ముళ్ళు ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్ళు.

నా శ్రీమతి సంధ్యారాణి. రచయిత్రి కూడా. నా ప్రాణంలో ప్రాణం. బతుకు పోరులో నిశ్శబ్ద కార్యశీలి. మా అమ్మాయి లక్ష్మీ భార్గవి. అల్లుడు లక్ష్మీ నారాయణ. భద్రాచలంలో ఐటిసి కంపెనీ వారి స్కూల్లో టీచరు. వాళ్ళకి ఇద్దరు పిల్లలు. సుదేష్ణ, అభిరామ్. మా అబ్బాయి విజయచంద్ర. సాఫ్ట్‌వేర్ ఇంజనీరు.నిమ్స్‌లో మా నాన్నగారిపేరున 'డయాబెటిక్ వార్డ్'నీ 'హిమోఫీలియా' వార్డునీ నా విరాళంతో ఏర్పాటు చేశాను. మా తల్లిదండ్రుల పేరుమీద (పల్నాడు) శైవ క్షేత్రం సత్రశాలలోనూ, మా గ్రామం చుండూరు లోనూ ప్రత్యేక గదుల నిర్మాణం చేయించాను.

## సినిమా మోజు పాటల క్రేజ్

నాన్నగారు ఎక్సయిజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్. తరచు బదిలీల వల్ల నా బాల్యం, చదువూ అనేక చోట్ల జరిగింది. సినిమాలంటే ప్రాణం, పాటలంటే ఇష్టం. సినిమా పాటల మీద ప్రేమతో నేను 'పాట వెనుక ఫ్లాష్' అంటూ రేడియోలో ధారావాహికని ప్రసారం చేశాను. ఆంధ్రప్రభలో అనుభవాలన్నీ అదే పేరుతో ఒక ధారావాహిక శీర్షికలో వచ్చాయి.

## బందరులో చదువు, సాహిత్య వాతావరణం

బిఎస్సీ కోసం బందరు నేషనల్ కాలేజీలో చేరాను. ఆ వూర్లో ప్రతి రోజూ సాహిత్య సభలూ, సమావేశాలూ, గోష్ఠులే. పార్కుల్లో, నవ కళా సెంటర్‌లో, మోడ్రన్ కేఫ్‌లో-అన్నిచోట్లా రచయితలు కలుసుకోవటం, కథానికల గురించి మాట్లాడుకోవటం, సింగరాజు రామచంద్రమూర్తి, ఆదివిష్ణు, విహారి, శాలివాహన, యర్రంశెట్టి శాయి, నందం రామారావు, చందు సోంబాబు, పీశుపాటి ఉమా మహేశ్వరం, విశ్వభరత్, దొండపాటి దేవదాసు... ఇలా ఎందరో, వీరంతా ఒకరికొకరు రచనకు ప్రేరణ. ఒకరికొకరు పోటీ. పోటీ కథల్లో ఒకటో రెండో బందరువే. ఆంధ్రపత్రిక, భారతిలో అప్పటికే ప్రసిద్ధుల కథలు వస్తూవుండేవి. నేనూ రచయితని కావాలనే కోరిక మొగ్గ తొడిగింది.బహుమతి తెచ్చుకోవాలనే ఆకాంక్ష. విహారి కథానికలు రాసే వాళ్లకి పెద్ద డ్రైవింగ్ ఫోర్స్. నా కథానికలకి ఆయనే తొలి పాఠకుడు, తొలి గురువు. ఆ ప్రోత్సాహంతో నా కథా రచన శరవేగంగా సాగింది. వారం విడిచి వారం నా కథ ఆంధ్ర పత్రికలో వచ్చేంత స్పీడ్‌గా రాసేవాణ్ణి.

## రేడియో,దూరదర్శన్‌తో అనుబంధం

బిఎస్సీ కాగానే రాజధాని చేరాను. నాకేమో డాక్టర్ కావాలనే కోరిక. కానీ కుదరలేదు. హైదరాబాద్‌లో నాకు పెద్ద గైడ్ ఫ్రెండ్, ఫిలాసఫర్-యర్రంశెట్టి శాయి. ఆయన ప్రోత్సాహంతో ఎంతో నేర్చుకున్నా. ఎన్నెన్నో రచనలు చేశాను. ఆ సమయంలో పి.యస్.నారాయణ, పి.వి.ఆర్.శివకుమార్, మైనంపాటి భాస్కర్, తులసీ బాలకృష్ణ, పురాణం శ్రీనివాసశాస్త్రి, ప్రతాప రవిశంకర్ వంటి రచయితలమంతా సన్నిహితంగా మెలిగేవాళ్లం.

న్యాయపతి రాఘవరావుగారి పరిచయం నా జీవితంలో పెద్ద మలుపు. వారు నన్ను రేడియోలో క్యాజువల్ ఆర్టిస్టుగా పరిచయం చేశారు. ఆ నాటి నుంచీ రేడియోలో -ఎనౌన్సర్, రిపోర్టర్‌గా, డ్రామా వాయిస్ ఆర్టిస్టు-డ్రామా ప్రొడ్యూసర్‌గా, న్యూస్ రీడర్‌గా-రెగ్యులర్ ఉద్యోగిని కాకపోయినా, అంతకంటే ఎంతో మిన్నగా ఇరవై అయిదేళ్లకు పైబడి వివిధ భూమికలు నిర్వహించాను. ఈ నాటికీ, నా రేడియో అనుబంధం ఎంతో దృఢంగా ఉంది. తర్వాత ఆంధ్రభూమిలో ఏడేళ్ళు సీనియర్ సబ్ ఎడిటర్‌గా ఉద్యోగం చేశాను. పల్లకి వారపత్రికకి కొన్నాళ్ళు ఎడిటర్‌గా చేశారు.

'జైలు గోడల మధ్య' స్వాతిలో సీరియల్ కథనాలు వచ్చాయి. నేరస్థుల మానసిక స్థితి మీద ప్రత్యేక పరిశోధన చేశాను. శిక్షననుభవిస్తున్న ఖైదీల 'జీవుడి వేదన'కి అక్షర రూపాలు అవన్నీ. రాష్ట్రంలోని ఎన్నో జైళ్ళు తిరిగి వ్రాశాను. 'సోషల్ మెడిసిన్ థియరీ'ని ప్రతిపాదించాను. దీనిమీద ఢిల్లీ జెఎన్‌యు నేర పరిశోధన విభాగంలో-పత్ర ప్రదానాలు చర్చలు జరిగాయి.

## ప్రయోగాత్మక కథా రచనలు


సుమారు 400 కథానికల్ని రాయటం ఒకయెత్తు కాగా, రచయితగా అనేక ప్రయోగాలు చేశాను. మైనంపాటి భాస్కర్‌తో కలిసి పెద్ద కథలూ రాశాను. విడిగా పేజీ కథలూ రాశాను. సున్నితమైన మనస్తత్వాల మెరుపుల మరకల్లాంటివి ఇవి. 'కాలమ్' కథలు అని 'కాలమ్' మీద శ్లేషతో, పంచ్‌తో ఆకలి వంటి సార్వకాలికమైన సహజాతాల మీద వ్యంగ్య కథనాలూ రాశాను. ఉత్త'రాళ్ళ' కథానికల్లో అంతా వ్యంగ్యమే. ఇవన్నీ 'అదృష్టం', 'ఆకలి'.. ఇలా అన్నీ అచ్చుల్లో శీర్షికలతో సాగుతాయి. అలాగే-'క' నుంచి 'శ' వరకూ హల్లుల్లోనూ సాగుతాయి. సరదా మాటల హాస్యంతో 'టెలిఫోన్' కథలూ,విభిన్న వయసుల వారి ఆకర్షణలు,వ్యామోహాలు,స్వభావాలకు అద్దం పట్టే 'వయసు కథలు' ఎన్నో గొలుసు కథలూ రాశాను. 1991లో 'నాలుగు శతాబ్దాల నగరం' పరిశోధనాత్మక రచన పుస్తకంగా అనేక భాషలలో వెలువడింది.

కడప, నరసరావుపేట పట్టణాల 200 ఏళ్ళ చరిత్ర ప్రత్యేక సంచికలకీ సంపాదకత్వం, పిల్లల కోసం 'మన హైదరాబాద్' సంక్షిప్త ఆంధ్రుల చరిత్ర' వంటి పుస్తకాలతోపాటు, బాల సాహిత్యంలో ఎన్నో రచనలూ వున్నాయి. ప్రసారమాధ్యమాలపై వ్రాసిన 'వెలుగు దారిలో తెలుగు జర్నలిజం' మరో రచన.

50 పుస్తకాల వరకూ సృజన సాహిత్యం వుంది. 50కి పైన నేను సంపాదకత్వ నిర్వహణ వహించిన పుస్తకాలు వచ్చాయి. 50కి పైబడి వీడియోలు డాక్యుమెంటరీలు వున్నాయి. 200కి పైగా ఆడియోలు-నాటికలు, నాటకాలు, రూపకాలు వంటివీ ఉన్నాయి.

ఇస్కాన్ (మధుర,బృందావనం), బ్రహ్మకుమారీస్ (మౌంట్ అబూ), స్వామి సమర్థ (అక్కల్ కోట్), గాయత్రీ పరివార్ (హరిద్వార్), గాడ్‌గారు (వెదురుపాక) వంటి ప్రదేశాలు దర్శించి రాసిన పుస్తకం 'ఆధ్యాత్మిక అడుగుజాడలు' డాక్యుమెంటరీగా,దూరదర్శన్‌లో సీరియల్‌గానూ వచ్చింది.

'దిద్దుబాటు', 'కలుపు మొక్కలు', 'దాసరిపాట'


రాజమండ్రిలో శ్రీపాద విగ్రహ ప్రతిష్ఠ సందర్భంలో...

వంటి ఆనాటి గొప్ప కథానికల్ని 'కథావీధి' పేరుతో-శైలజాసుమన్‌గారి నిర్వహణలో దూరదర్శన్‌లో ప్రసారం చేశాం. చాలా విద్యా విషయిక డాక్యుమెంటరీలు కూడా చేశాం.

బాలసాహిత్యంలో తొలి చిల్డ్రన్ వీడియో మేగజైన్ 'ఇంద్ర ధనస్సు' ను ఏడు సంపుటాలు-బాలల అకాడెమీ కోసం తయారు చేశాను. దీనిని ముందు దూరదర్శన్ ప్రసారం చేసింది.

1996లో కేంద్ర సాహిత్య అకాడమీ పక్షాన హైదరాబాద్‌లో ఐదు రోజుల కథానికా, రచయితల కార్యగోష్ఠిని-నిర్వహించాను. అప్పుడే వాకాటి గారితో కలిసి 60 మంది కథానికలతో కేంద్ర సాహిత్య అకాడెమీ వారి 'బంగారు కథలు' సంకలనాన్నీ తెచ్చాం.

డాక్టర్‌ని కాలేకపోయినా, ఆ వేదనతో వైద్య విజ్ఞాన రంగంలో విశేషమైన కృషి చేసి ఎన్నో 'సిరీస్' పుస్తకాలు వెలువరించాను. 'తెలుగు పత్రికలు ధోరణులు' అనే అంశం మీద 1994లో పిహెచ్‌డి చేసి 'డాక్టర్'నయ్యాను! పలు అంశాల్లో డిగ్రీలూ, డిప్లొమాలూ సాధించి తెలుగు యూనివర్శిటీ, ఉస్మానియా, అంబేద్కర్ యూనివర్శిటీల్లో జర్నలిజం కోర్సులకు విజిటింగ్ ఫ్యాకల్టీనయ్యాను.

## కథానికా సదస్సులు

1994 నుంచీ కథానికా ప్రక్రియ ప్రాచుర్యానికీ, రచనా విస్తృతికీ నా వంతు కృషి చేశాను. శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్ ప్రచురణలుగా ప్రతి యేటా పత్రికల్లో వచ్చిన కథానికలపై 'కథా సమీక్ష'లు వెలువరించాను. బుచ్చిబాబు అవార్డు నెలకొల్పి అనేకమందిని ప్రముఖ రచయితలను సత్కరించి వారి కథానికా సంపుటాలు ప్రచురించాను.

డైరెక్ట్ కథలతో 'కొత్తకథ', 'సరికొత్త కథ', 'వినూత్న కథ', 'నవతరం కథ' వంటి సంకలనాల్ని శతాధిక రచయితల రచనలతో ప్రచురించి ఉత్తేజాన్ని కలిగించాను.

## కథానికా శతజయంతి ఉత్సవాలు

గురజాడవారి శత జయంతి ప్రారంభ సంవత్సరం సూచకంగా-ప్రారంభ సభల్ని 2009 ఫిబ్రవరి 9,10 తేదీల్లో విజయనగరంలో గురజాడ వారి ఇంటినుంచీ ప్రారంభించాం. 'దిద్దుబాటు' మొదటి కథానిక కాబట్టి గురజాడకి నివాళిగా వారి ఇంట్లోనే ఈ పండుగ మొదలైంది. 100 మందికి పైగా కథకులు, 200 మంది సాహితీ ప్రియులు ఆ సభల్లో పాల్గొన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచీ అభిమానులు తరలివచ్చారు. ఏడాదిపాటు 23 జిల్లాల్లో జిల్లా స్థాయి సదస్సులు, నాలుగు ప్రాంతీయ సదస్సులు నిర్వహించాం. చివరి సభ రాష్ట్ర స్థాయిలో మళ్ళీ విజయ నగరంలో 2010 ఫిబ్రవరి 7,8 తేదీల్లో జరిగింది. 21 జిల్లాల్లో కథానికా వికాసం మీద 21 మంది రచయితలు వ్రాసిన వ్యాసాల సంకలనం ''తెలుగు కథానికకు వందేళ్ళు'' ప్రచురించాను. ఔత్సాహికులకు కథానికా రచన పోటీ నిర్వహించి, ఆ కథానికలన్నింటినీ-సుప్రసిద్ధ కథకుల కథానికల సరసన-'అద్దం' పేరుతో సంకలనంగా తెచ్చాను.


కుటుంబ సభ్యులతో...

### ఇష్టమైనవి

| | | |
|---|---|---|
| సినిమా | : | మాయా బజార్ |
| నటుడు | : | జగ్గయ్య |
| నటి | : | సావిత్రి |
| గాయకుడు | : | ఘంటసాల |
| గాయని | : | సుశీల |
| నవల | : | చివరకు మిగిలేది |
| కవి | : | విశ్వనాథ |
| కథకులు | : | విహారి, యర్రంశెట్టి శాయి |
| వంట | : | బుంగ మిర్చి కూర |

## గురజాడ,శ్రీపాద స్ఫూర్తి ప్రదాతలు

మహోద్యమ సాహిత్య కారుడు,నవయుగ వైతాళికుడు, తెలుగు జాతికి ఆధునిక కథానిక, నాటకం, గేయం, వ్యవహార భాష విషయం లో యుగకర్త గురజాడకు నమో నమః. వారి ఇంటిని మరమ్మతులు చేయించి ఈనాడు పూర్తి వినియోగంలోకి తేగలిగినందుకు చాలా సంతోషిస్తూ వుంటాను. శ్రీపాదవారికి, నివాళిగా రాజమండ్రిలో వారి నిలువెత్తు విగ్రహాన్ని నెలకొల్పటం గొప్ప విజయంగా భావిస్తాను.


...తి బొత్స సత్యనారాయణ నుండి అవార్డు అందుకుంటూ...

## నంది బహుమతులు

'పాపం పసివాడు' ఆంధ్రభూమి ధారావాహిక, అనాథ బాలల మీద వాస్తవ గాథలు దూరదర్శన్ సీరియల్‌గా వచ్చి అనన్య ప్రాచుర్యం పొందింది. ఆ సంఘటనలు జరిగిన ప్రాంతాల్లోనే 52 ఎపిసోడ్‌లు నిర్మించాను. నిర్మాతగా బంగారు నంది, దర్శకుడుగా నంది నగదు పురస్కారాలు అందుకున్నాను. 'అగ్నిసాక్షి' అని వరకట్నాల మీద ప్రత్యేక వాస్తవ కథనాలు, ఆంధ్రభూమిలో దూరదర్శన్‌లోనూ, రేడియోలోనూ ప్రసారమైనాయి. 'వీళ్ళేమంటారు?' అని ఆంధ్రప్రభలో (శ్రీకాంతశర్మగారు ఎడిటర్‌గా ఉన్నప్పుడు) ధారావాహిక కథనాలు రాశాను. సమాజంలో నిరాదరణకు గురయిన కాటికాపరి స్త్రీ, మార్చ్యువరీ బాయ్, ఉప్పుకయ్యల్లో పనిచేసే కూలీ, కుష్టురోగి... ఇలా ఎందరో..చీకటి కోణంలో జీవిస్తున్న వారి వాస్తవ కథనాలివి. దర్శక నిర్మాతగా,రచయితగా రూపొందించిన 'అడవి మనిషి' బాలల చిత్రానికీ నంది అవార్డ్ లభించింది. 'సముద్రం' కథానికకి ఆంధ్ర సచిత్ర వారపత్రిక ప్రథమ బహుమతి,అదే పేరుగల కథానికా సంపుటికి తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు లభించాయి.

సంకల్పబలం వుంటే జీవించగలం, సాధించగలమనేది స్వానుభవం. మనసులో మాట దాచుకోలేను. మొహాన్న అనేస్తాను. అందువలన చాలామందికి దగ్గరయ్యాను. ఎందరికో దూరమయ్యాను. నన్ను 'కథానికా జీవి' అని విహారివారూ, పోరంకి వారూ అంటే, 'కథోద్ధారక' అన్నారు వీరాజీ, మంగళగిరి ఆదిత్య ప్రసాద్ వంటి పెద్దలు.

మనకు Telugu kathanika.com' వెబ్‌సైట్ వుంది. వందకిపైగా ఫోటోలు, విశేషాలు వున్నాయి. లేనివారంతా తమ ఫోటోలు, చిరునామాలూ-సాఫ్ట్ కాపీలో- vedagiri-rambabu@ yahoo.co.in కి పంపమని కోరుతున్నాను. కథానికా రచన, పఠనం కూడా సమాజహితానికి ఉపయోగపడాలనే విశ్వాసంతో కలిసి నడుద్దాం. అక్షరంలో అణుశక్తివుంది. అది సమాజ హితానికి ఉపయోగపడాలి కథంటే సంస్కారాన్ని పెంచాలి.

-ఎస్.వి.రమణ

నాకు నచ్చిన నా కథ

# ఇది ఒక్క రాత్రి కథ కాదు

- వేదగిరి రాంబాబు

"ఇవాళ్ళ 'జీరో-టు' తగిలి తీరుతుంది" తనలో తనే మరోసారి గొణుక్కున్నాడు శివరావు.

అందుకోసమే ఆ నెంబరు మీద కనీసం రెండు రూపాయలన్నా కట్టాలని ముఖ పరిచయమున్న ప్రతివాణ్ని అప్పు అడిగాడు. కాని ఫలితం శూన్యం.

తాకట్టు పెట్టదగ్గ వస్తువు కూడా ఇంట్లో ఏమీ లేదు.

ఏం చెయ్యాలో శివరావుకి పాలుపోవడం లేదు. టయిమ్ గడుస్తున్న కొద్దీ అతన్లో ఆతృత అధికమౌతోంది. మనసు విపరీతంగా పనిచేస్తోంది.

వున్నట్టుండి శివరావు మెదడులో ఓ మెరుపు మెరిసింది. ఆ మెరుపు కాంతిలో తండ్రి ముడుపు కట్టుకున్న అయిదు రూపాయల కాగితం కన్పించింది.



బహుశా చెల్లెలు మంచినీళ్ళు తేవడాన్కి చెరువుకి వెళ్ళి వుంటుంది. అన్నయ్యా, నాన్నా ఎట్లాగో వూళ్ళో లేరు. ఇదే మంచి సమయం. శివరావు కాళ్ళు యింటికేసి కదిలాయి.

శివరావు ఇంటికి జేరుకునేసరికి అతను అనుకున్నట్లు ఇంట్లో ఎవ్వరూ లేరు. బయటగొళ్ళెం పెట్టుంది.

ఆ చుట్టుపక్కల వాళ్ళంతా అక్కడికి రెండు ఫర్లాంగుల దూరంలో వున్న చెరువు నుంచి మంచినీళ్ళు తెచ్చుకుంటుంటారు. శివరావు చెల్లెలు రమ మళ్ళీ వెంటనే తిరిగొస్తాను కదా అనే వుద్దేశంతో మంచినీళ్ళకి వెళ్ళేప్పుడు బయట గొళ్ళెం పెట్టి వెళ్తూంటుంది.

''చెల్లాయి వచ్చేలోపలే పని పూర్తి చేసుకువెళ్ళి పోవాలి'' అనుకుంటూ తలుపు తెరిచాడు శివరావు.

సరాసరి కావడిపెట్టి దగ్గరికి వెళ్ళాడు. గబగబా దాంట్లో వున్న గుడ్డలన్నిటినీ తీసి పక్కన పడవేయసాగాడు. అడుగున వున్న పసుపు గుడ్డ మూటని చూడగానే అతని కళ్ళు ఆనందంతో మెరిశాయి. దాన్ని పక్క నుంచి గుడ్డలన్నిటినీ తిరిగి పెట్టెలో సర్దేశాడు.

కూతురు పెళ్ళి జరిగితే కొండ కొస్తానని వెంకటేశ్వరస్వామికి మొక్కుకుని, అయిదు రూపాయల కాగితాన్ని ముడుపుకట్టి పెట్టుకున్నాడు శివరావు తండ్రి నిరంజనం.

పెట్టె మూత మూసి ఆత్రంగా పసుపుగుడ్డ విప్పాడు శివరావు అక్కడక్కడా పసుపయి, బాగా నలిగిపోయిన అయిదు రూపాయల కాగితం బయట పడ్డది. దాన్ని చూడగానే శివరావు కంటిముందు తండ్రి మెదిలాడు. 'ఈ ఐదు రూపాయలు పోయినట్లు ఆయనకి తెలిసిందంటే గుండె ఆగిపోయినా ఆగిపోతుంది. రేప్పొద్దునే ఆ డబ్బు తీసుకొచ్చి యథాస్థానంలో పెట్టేయాలి' అనుకున్నాడు శివరావు.

ఆ అయిదు రూపాయల్ని తీసుకెళ్ళి వెంకటేశ్వరస్వామి పటం ముందు పెట్టి, చేతులు జోడించాడు.

''స్వామీ, ఇవాళ తప్పకుండా 'జీరో-టు' తగిలేటట్లు చూడు. కాయటాన్కి మీ డబ్బే తీస్కెళ్తున్నందుకు నన్ను క్షమించు. అంతకన్నా వేరే గత్యంతరం కన్పించలేదు. చాన్సు తగిలిందంటే అయిదు రూపాయలకి బదులు ఇరవై రూపాయలు ముడుపు కడ్తాను. అంతా మీ దయ!''

గబగబా బయటికొచ్చి గొళ్ళెం పెట్టాడు. అతని కళ్ళు భయంగా ఒకసారి పరిసరాల్ని పరికించాయి. ఎక్కడా రమ వస్తున్న జాడలేదు. ఒకసారి తృప్తిగా గాలి పీల్చి బయల్దేరాడు. అతని కళ్ళ ముందు అయిదు రూపాయల కాగితం అరవై నాల్గు రూపాల్లో తాండవిస్తు కన్పించసాగింది.

## 2

సత్యమూర్తి స్థిర నిశ్చయానికొచ్చాడు.

అది చాలా దృఢమైంది.

దానికిక తిరుగులేదు.

ఆ నిశ్చయానికి రాగానే అతని మనస్సు కొద్దిగా తేలిక పడినట్లు అన్పించింది.

అతని చూపులు స్థిరంగా రైలు పట్టాల వెంట పరుగెత్తసాగాయి. కాళ్ళు స్లీపర్‌ని విడిచి స్లీపర్‌ని తాకుతున్నాయి.

మానువుడాశాజీవి. అందుకు నిదర్శనం సత్యమూర్తి. ఆ ఆశవల్లే ఇంత కాలం బతికాడు. ఆ ఆశ తనకి ఎండమావిలాంటిదని తెలుసు కున్నాడు. తాను వుద్యోగాన్ని సంపాదించుకోగలననే కొద్దో గొప్పో వున్న ఆశ కూడా ఇవ్వాల్టి ఇంటర్వ్యూతో పూర్తిగా ఆవిరయింది.

అందుకే ఈ నిశ్చయానికొచ్చాడు.

సత్యమూర్తి జాలిగా ఒకసారి తన శరీరంవైపు చూసుకున్నాడు. ఇంకాసేపట్లో ఈ అవయవాలు ఎక్కడెక్కడ ఏయే రూపాల్లో వుంటాయో! ఈ ఆలోచన కలగ్గానే అతని కళ్లు చెమ్మగిల్లాయి.



'తను తిన్నా తినకపోయినా కూడా లెక్క చేయకుండా ఈ శరీరాన్ని ఎంతో మమకారంతో పెంచారు నాన్నగారు. కాని తను మరి కొద్ది నిముషాల్లో దాన్ని నిర్దాక్షిణ్యంగా రైలు కింద నలిపేయడానికి నిశ్చయించుకున్నాడు!' విరక్తిగా నవ్వుకున్నాడు తన్లో తానే.

అతని చూపులు స్థిరంగా రైలు పట్టాల వెంట పరుగెత్తు తున్నాయి. పాదాలు స్లీపర్‌ని విడిచి స్లీపర్‌ని తాకుతున్నాయి.

'తను పెద్దకొడుకై నాన్నగార్ని ఏ మాత్రం సుఖపెట్ట గలిగాడు. మరిన్ని కష్టాల్లో ముంచడం తప్ప? మరో మూడు నెలల్లో ఆయన తన ఎలిమెంటరీ స్కూల్ మాస్టర్ గిరికి రిటైర్‌మెంట్ వల్ల స్వస్తి చెప్పబోతున్నారు. తను రిటైర్ అయేనాటికి చేతికంది వస్తాననే ఆశతో వున్న అరెకరం పొలం అమ్మి గ్రాడ్యుయేటుని చేశారు. డిగ్రీ పుచ్చుకొని నాలుగేళ్ళు దాటుతున్నా ఇంతవరకు ఏ వుద్యోగాన్ని సంపాదించుకోలేక పోయాను. నాన్నగార్కి సహాయ పడలేకపోగా ఇంకా భారంగా వుండ లేను'' సత్యమూర్తి మనసు బాధతో మూల్గింది.

వుద్యోగం రాకపోవడంలో పాపం సత్యమూర్తి తప్పేమీ లేదు. పడిన ప్రతి వుద్యోగాన్కి దరఖాస్తులు పెట్టాడు. పిల్చిన ప్రతి ఇంటర్వ్యూకీ అప్పసప్పో చేసి వెళ్ళిడు. అంతమాత్రానికే ఉద్యోగం వరిస్తుందా; నీ దగ్గర డబ్బుందా? రికమెండేషనుందా? నిన్ను వరించడానికి – పొమ్మంది.

నాలుగేళ్ళు ఓపిగ్గా ఉద్యోగాన్వేషణ చేశాడు కాని ఇవ్వాల్టితో అతని ఓపిక సమూలంగా తుడిచి పెట్టుకుపోయింది. అందుకే మృత్యువుపై మమకారాన్ని పెంచుకుని ఆమె కౌగిట్లో కరిగిపోదామని బయలుదేరాడు.

ఆలోచనల మధ్య అవుటర్ సిగ్నల్ చేరుకున్నాడు. అక్కడే నిలబడి ఓసారి చుట్టూ చూశాడు. రైలు కట్ట ప్రక్కనే అక్కడొకటి అక్కడొకటి కొన్ని గుడిసెలు, చిన్నచిన్న పెంకుటిళ్ళూ వున్నాయి. ఎవరి పనుల్లో వాళ్ళున్నారు. ఎవ్వరూ తనని ప్రత్యేకంగా గమనించడం లేదు. తిరిగి రైలు పట్టాల వెంట నెమ్మదిగా నడక సాగించాడు సత్యమూర్తి.

అతనికి మర్చిపోదామనుకుంటున్న కొద్దీ ఆ రోజు జరిగిన ఇంటర్వ్యూ తిరిగి తిరిగి గుర్తుకు రాసాగింది. కోపంతో శరీరం వుడికి పోసాగింది.

వున్న వేకెన్సీలు నాల్గు. ఇంటర్వ్యూ కొచ్చిన అభ్యర్థులు నాల్గొందలు. ఆ నాల్గు వేకెన్సీలు కూడా ముందే కంపెనీ మానేజిమెంట్ తరపు మనుషులకు రిజర్వ్ చేయబడ్డాయట. మరటువంటప్పుడు, తమలాంటి వాళ్ళని పిలిపించి బాధించడమెందుకో అర్థం కాలేదు సత్యమూర్తికి. కోపాన్ని పట్టలేక ఆ మాటే అక్కడున్న ప్యూన్ని అడిగాడు.

''ఈ ఇంటర్వ్యూలు జరుపుతున్నది ఖాళీలు భర్తీ చేయడాన్కి కాదు

బాబు! కంపెనీ ప్రెస్టేజ్ కోసం. కాగితాల మీద జరపాల్సిన కర్మకాండ పూర్తిగా జరిపించడం కోసం. అదీగాకుండా అప్లికేషన్‌తోపాటు కొంత ఫైకాన్ని వసూలు చేసుకోవడం కోసం'' వేదాంతిలా నవ్వాడు.

సత్యమూర్తికి అరికాలిమంట నెత్తికెక్కింది. కోపంతో ముఖం ఎర్రబడింది. పళ్ళు పటపటా నూరాడు. మిషన్ గన్ గనుక దొరికితే వరసపెట్టి అందర్నీ కాల్చేయ్యాలనిపించిందతనికి. కాని, ఏం చెయ్యగలడు? మారు మాటాడ కుండా వెనుదిరిగాడు.

దూరంగా రైలుకూత వినిపించింది. కళ్ళు చికిలించుకుని చూశాడు. మసక చీకటిని చీల్చుకుంటూ రైలు ముందుకు వస్తోంది.

''నన్ను క్షమించండి నాన్నగారూ! మీకు నా దౌర్భాగ్య ముఖాన్ని చూపలేను. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నాను'' నెమ్మదిగా గొణుక్కున్నాడు.

''ఏం బాబూ! ఆత్మహత్య చేసుకోడాన్కి బయలుదేరావా?' భుజం మీద చెయ్యి పడటంతో వులిక్కి పడ్డాడు సత్యమూర్తి. పక్కకి తిరిగాడు.

ఒక ముసలాయన నిలబడున్నాడు. ఆయనకి సుమారు యాభై సంవత్సరాలుంటాయి. చాలా సాధారణమైన దుస్తులు ధరించి వున్నాడు. కోపం తాలూకు చిహ్నాలు మొహంలో స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఆయన చూపులు తీక్షణంగా సత్యమూర్తి మొహాన్ని తాకుతున్నాయి.

ఆ చూపుల ధాటికి తట్టుకోలేక తలవంచుకున్నాడు సత్యమూర్తి.

రైలు కూత మరోసారి విన్పించింది.

''మేము తినీ తినకుండా మిమ్మల్ని కష్టపడి పెంచితే, మమ్మల్ని సుఖపెట్టక పోగా, మరిన్ని కష్టాల్లో ముంచి ఆత్మహత్య చేసుకుంటారా? ఇది మీకు న్యాయమేనా?'' సత్యమూర్తికి ఆయన్నెప్పుడూ చూసిన గుర్తు కూడా లేదు. అతనికి ఆయన ప్రవర్తన, మాటలు కంగారు పుట్టిస్తున్నాయి.

''ఏమిటండీ మీరనేది? నన్నెవరకున్నారు?'' తడబడ్డాడు.

''నాకు తెలీదనుకుంటున్నావా నువ్వెవరివో! ఉద్యోగం రాకపోతే ఏ మూటలు మోసయినా తల్లిదండ్రుల్ని బ్రతికించుకోవాలి. అంతేగాని ఆత్మహత్య చేసుకుంటావా?'' తన మనసులోని విషయాన్ని ఆయనెట్లా పసిగట్టాడో అర్థం కావడం లేదు సత్యమూర్తికి.

''ఏమిటయ్యా! అట్లా గుడ్లు మిటకరించి చూస్తావ్? అదిగో బండి వచ్చేస్తోంది. ముందు రైలు కట్ట దిగు'' పక్కకి తోశాడు. సత్యమూర్తి పడబోయి తమాయించుకుని నిలబడ్డాడు.

సత్యమూర్తికి అంతా అగమ్యగోచరంగా వుంది. తన్ని పక్కకి తోసిన ముసలాయన తీక్షణంగా వచ్చే బండిని చూస్తూ రైలు పట్టాల మధ్య నిలబడ్డాడు. బండి దూసుకు వచ్చేస్తోంది.

''ఏమండోయ్! బండి వచ్చేస్తోంది. పట్టాల మీంచి ఆ ముసలాయన్ని పక్కకి లాగండి'' ఎవరో కుర్రాడు అరుచుకుంటూ పరుగెత్తుకొస్తున్నాడు. బండి బాగా దగ్గర కొచ్చేసింది.

సత్యమూర్తి ముసలాయన్ని పక్కకి లాగబోయాడు. ఆయన సత్యమూర్తిని విదిలించి కొట్టాడు.

''ఆయనకు మతిస్థిమితం లేదు. బండి కింద పడతాడు. పక్కకి లాగండి'' కుర్రాడు రొప్పుకుంటూ పరుగెత్తుకొసున్నాడు.

సత్యమూర్తి రెండు చేతులూ ముసలాయన నడుముకి వాటేసి, బలవంతాన పక్కకి లాగాడు.

బండి మరీ దగ్గర కొచ్చేసింది. సత్యమూర్తి ఆయన్ని మరింత గట్టిగా పట్టుకున్నాడు.

దడదడ శబ్దం చేసుకుంటూ బండి వాళ్ళ పక్కనుంచీ దూసుకుపోయింది.

ఆ కుర్రాడు వాళ్ళని చేరుకున్నాడు. చెమటతో అతని చొక్కా పూర్తిగా తడిసి పోయింది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో అతని గుండె అదిరి పడుతోంది. కృతజ్ఞతగా సత్యమూర్తి వంక జూశాడు.

''చాలా థాంక్స్ అండీ! మీకు శ్రమ ఇస్తున్నందుకు వేరేగా భావించకండి. అదుగో ఆ కనిపించే చిన్న పెంకుటిల్లే మాది. దయచేసి అంతవరకూ ఈయన్ని పట్టుకెళ్ళడానికి సహకరించండి!'' కుర్రాడు సత్యమూర్తిని అభ్యర్థించాడు.

''పదండి''

''వదలండిరా నన్ను. నా కొడుకుని పొట్టన బెట్టుకున్న ఆ రైలు అంతం చూస్తాను'' ముసలాయన ముందుకు రానని మొరాయించసాగాడు. ఇద్దరూ ఆయన చెరోపక్క పట్టుకొని బలవంతాన ఇంటికిజేర్చారు. ముసలయాన్ని ఒక గదిలో తోసి బయట గొళ్ళెం పెట్టాడు కుర్రాడు.


''నా పేరు రాజండి. ఆయన మా నాన్నగారు. మా నాన్నగారి ప్రాణాలు కాపాడినందుకు మీకెట్లా కృతజ్ఞతలు చెప్పాలో నా కర్థం కావటం లేదు.'' కళ్ళలో కృతజ్ఞతాభావంతో సత్యమూర్తి చేతులు పట్టుకున్నాడు రాజు.

''మరి...'' సత్యమూర్తికి ఎట్లా అడగాలో ఏమని అడగాలో అర్థం కాలేదు.


రాజే చెప్పుకుపోసాగాడు! ''మా నాన్నగారు తాలూకా ఆఫీసులో గుమస్తాగా పని చేస్తుండే వారు. ఆయనకు నేను, అన్నయ్యా ఇద్దరం రెండు కళ్ళు. నాన్నగారి ఆశలన్నీ అన్నయ్య మీదనే వుండేవి. చదవడమైతే వాడివల్ల అయిందిగాని ఉద్యోగం సంపాదించుకోవడం వాడి వల్ల కాలేదు. ఇరవై అయిదేళ్ళు దాటినా తండ్రి సంపాదన తింటూ కూర్చోవడం వాడికి బాధగా వుండేది.

తన ఆత్మహత్యకి ఎవరూ కారణం కాదని, వుద్యోగం లేకపోవడంతో విసిగి ఆత్మహత్య చేసుకొంటున్నానని వుత్తరం రాసి; సరిగ్గా ఇందాక మీరు నాన్నగార్ని రక్షించిన చోటే, అదే రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

అమ్మకి అసలే గుండె నొప్పి. ఈ విషయం తెలియగానే పడిపోయింది. కొడుకు చచ్చిపోయాడన్న వార్త విని ఇరవై నాలుగు గంటల్లోపలే ఆవిడా కొడుకును వెదుక్కుంటూ ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోయింది. నాన్నగారి మనసు ఒకేసారి ఈ రెండు షాక్‌లకు తట్టుకోలేక పోయింది. అప్పట్నుంచీ మతి స్థిమితం తప్పింది.



## మార్పు అనివార్యం



సమాజం మారుతూ వుంటుంది. అది దాని సహజ స్వభావం. మారే సమాజంతోపాటు సాహిత్యమూ మారాలి. ప్రాచీన సాహిత్యం నుంచీ ఆధునిక సాహిత్య ఆవిర్భావం అలాగే జరిగింది. ఇక ముందు కూడా సమాజానుకూలంగా సాహిత్యంలో ఎన్నో మార్పులు రాక తప్పదు. అలాంటి వాంఛనీయమైన మార్పుని తీసుకురావటానికి కథానిక శక్తివంతమైన సాధనం. ఈ కథ కూడా ఇలా సమాజ పరిణామాన్ని ప్రతిబింబిస్తుంది.

**–వేదగిరి రాంబాబు**
**సెల్ : 9391343916**

బండికూత వినిపిస్తే చాలు. పట్టాల వేపు పరుగెత్తుతారు. అందుకనే ఆయన్ని ఆ గదిలో పెట్టి తలుపు గడియ పెడ్తుంటాను. కాని ఇందాక భోజనం పెట్టి పళ్ళెం పుచ్చుకుని బయటి కొచ్చేప్పుడు, గొళ్ళెం పెట్టడం మర్చిపోయాను. కంచం కడిగి వచ్చేసరికి ఆయన గదిలో లేరు. రైలు కూత విన్పించింది. వెంటనే పరుగెత్తు కొచ్చాను. ఆ తరువాత సంగతి మీకు తెలిసిందే'' రాజు కళ్ళ వెంట అశృవులు ధారగా కారసాగాయి.

''ఈ రైలు పట్టాలకి దూరంగా పోతేగాని, ఆయనకి కొద్దిగానైనా మన స్థిమితం చిక్కదని తెలుసు. కాని ఏం చేయను; ఈ ఇల్లు అమ్మేస్తే, వచ్చిన డబ్బు కాస్తా నెలరోజుల్లోనే అయిపోతుంది. ఆ తర్వాత అద్దెకొంపల్ని ఎన్నాళ్ళని భరించగలను? నాన్నగార్ని జాగ్రత్తగా కాపాడుకోవాలంటే కనీసం రెండు గదులున్న ఇల్లయినా కావాలి''.

సత్యమూర్తి కళ్ళముందు తండ్రికి పిచ్చెక్కి పరుగెత్తుతున్నట్లు కన్పించ సాగింది. ఒక్కసారి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. మెదడ్లో రంగులు మారాయి. నిశ్చయం మారింది.

''నాకు కనువిప్పు కల్గించినందుకు చాలా థాంక్స్ అండీ! బండి బయల్దేరే టైం అయింది. వస్తా'' గబగబా ఇంట్లోంచి బయటికొచ్చాడు.

రాజుకి సత్యమూర్తి ప్రవర్తన వింతగా తోచింది.

''మాష్టారూ! ఒక నిముషం ఆగండి – కాఫీ కలిపి తెస్తా''.

''బండి టయిమయింది. ఈసారి మళ్ళీ ఇక్కడికొచ్చినప్పుడు వస్తా'' పరుగులాంటి నడకతో స్టేషన్‌కేసి నడవ సాగాడు సత్యమూర్తి.

అతని ప్రవర్తన అర్థం గాక రాజు అచేతనంగా చూస్తూ నిలబడిపోయాడు.

### 3

''రమా! నువ్విక్కడే కూర్చో టికెట్లు తీసుకొస్తాను'' రమని వెయిటింగ్ రూమ్‌లో కూర్చోమని టికెట్లు తీసుకురావడాన్కి బుకింగ్ వేపు బయల్దేరాడు ప్రసాద్.

రమ కాలక్షేపం కోసం చేతిలోనున్న వీక్లీని తెరిచింది.

తను ప్రేమించిన వాడికోసం తోబుట్టువుల్నీ, తల్లిదండ్రుల్నీ విడిచి వెళ్ళిపోయిన సావిత్రి అప్పుడు పరంధామయ్యగారి గురించి ఆలోచిస్తోందో లేదోగాని, పరంధామయ్య గారు మాత్రం సావిత్రినే తలచుకొని కుమిలి పోసాగారు.

మర్చిపోదామనుకుంటున్న కొద్దీ వూళ్ళోవాళ్ళ ములుకుల్లాంటి మాటలు మరిన్నిసార్లు గుర్తుకొచ్చి ఆయన మనసుని విపరీతంగా బాధించ సాగాయి.

అర్థరాత్రి దాటుతున్నా కంటి మీదకి చిన్న కునుక్కూడా రావడం లేదు.

చివరికో నిశ్చయానికొచ్చారు.

నెమ్మదిగా మంచం మీద నుంచి లేచి బావి వేపు బయలుదేరారు. మరో అయిదు నిముషాల తరువాత ఆయన శవం బావిలో నీళ్ళపై.

ఇక చదవలేక పోయింది రమ. పుస్తకాన్ని పక్కకి విసిరేసింది. ఆమె కళ్ళ వెంట అశ్రువులు ధారగా కారసాగాయి.

'వూళ్లో వాళ్ళంతా లేచిపోయిందాని తండ్రని, తండ్రిని నానామాటలంటున్నట్లు, ఆ మాటలు భరించలేక తండ్రి ఆత్మహత్య చేసుకున్నట్లు..'' విపరీతమైన ఆలోచనలు కలగసాగాయి.

'ఆర్థిక పరిస్థితి కాదాన ఇరవై సంవత్సరాలు దాటినా తండ్రి తనకి ళ్ళి చెయ్యలేక పోయాడు. దానికి ఆయన కుమిపోని క్షణం లేదు. కాని తనేం చేస్తున్నది? ప్రేమించిన వ్యక్తి కోసం అష్టకష్టాలు పడి పెంచిన తడినీ, తోబట్టువులనీ విడిచి వెళ్ళిపోతోంది. తన సుం గురించి ఆలోచించిందే గాని, తండ్రి పడబోయే మానసిక చిత్రహింస గురించి ఒక్కసారి కూడా ఆలోచించలేదు. 'నా జీవితం నాశనమై పోనా సరే, నా వల్ల నాన్నకి బాధ కలగకూడదు.' మ లేచి నుంచింది. తన సంచినీ తీసుకొని బయకొచ్చింది.

వాకిలి దగ్గరకి ప్రసా ఎదురొచ్చాడు.

''నన్ను క్షమించు ప్రసాద్! నా ఒక్కదాని సుఖం కోసం తండ్రినీ తోబుట్టువుల్నీ బాధించలేను'' ఆమె కళ్ళు వర్షించాయి.

ప్రసాద్‌కి అంతా యోమయంగా వుంది. ఆమె ప్రవర్తన వింతగా ంది.

''రమా! ఎక్కడికి వెళ్తున్నావ్?'' వెళ్తున్న రమని ఎదురెళ్ళి నిలబెట్టాడు.

''ప్రసాద్! నన్ను మర్చిపో. నేను బలహీనురాల్ని, నీతో రాలేను'' గబగబా ముందుకెళ్లిపోయింది.

ప్రసాద్ నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

***

రాత్రి పన్నెండు గంటలు దాటింది.

అమావాస్యకావడంతో, చీకటి నిరుద్యోగ కప్పా దట్టంగా వ్యాపించింది. అధికార, ధన వ్యామోహాలు తప్ప ప్రజ బాగోగులు పట్టని నాయకుడిలా రైలు తన గమ్యాన్ని చేరుకోడానికి ముదుకు పరుగెడుతోంది.

ఆ కంపార్టుమెంట్‌లో అంతా నిద్రపోతున్నారు. కాని నిరంజనం మాష్టారికి మాత్రం నిద్రరావడం లేదు. మరోరెండు నెలల్లో రిటైర్ కాబోతున్నారు. ఆ తరువాత కుటుంబ పరిస్థితుల ంరించి వూహిస్తుంటే ఆయనకి మతిపోతోంది.

వీటన్నిటికన్నా కుమార్తె పెళ్లి విషయం పె సమస్యగా నిల్చింది. ఈ సంబంధమన్నా నిశ్చయం కాబోతుందా అనేొండంత ఆశతో వచ్చారు.

పిల్ల నచ్చిందన్నారు.

సంప్రదాయం బాగుందన్నారు.

అన్నిటికీ సంతృప్తులమయ్యాం అన్నారు.

కానీ, కట్నం కనీసం రెండు వేలన్నా కావాన్నారు.

తన జీతంతో కుటుంబం గడవటమే అంతంత మాత్రం. అటు వంటప్పుడు రెండు వేలు ఎక్కడ్నించి తేగల్రు? అండే ఆ సంబంధం మీద ఆశ వదులుకుని తిరుగు ప్రయాణం కట్టారు.

'రమకి నెల రోజుల్లో ఇరవై సంవత్సరాలనిండుతాయి. అణుకువ గల పిల్ల కాబట్టి ఇంతవరకూ ఎటువంటి అఘయిత్యమూ చెయ్యలేదు. కాని బుసలు కొట్టే యవ్వనాన్ని ఎన్నాళ్ళెదురోగ్గల్డు? అసమర్థుడికి అన్నీ సమస్యలే! ఆడపిల్లకి పెళ్ళి చెయ్యలేను. పెద్ద కుక్కి ఉద్యోగం యిప్పించుకోలేను. చిన్న కొడుకుని బాగుచేయలేను. ఛీ. ఛీ... ఇటువంటి నిర్భాగ్యపు బ్రతుకు బ్రతుకేకన్నా రైల్లోంచి కిందికి డికి చావడం మేలు. చివరికి చావే తన సమస్యలన్నిటికీ పరిష్కార మనమని నిశ్చయించుకుని లేచి నిలబడ్డారు నిరంజనం గారు.

ఒళ్ళో పెట్టుకున్న సంచీ కింద పడింది. వంగొన్నందుకో బోయారు. దాంట్లోంచి కూతురు ఫొటో కిందపడింది. రు ఫొటోని చూడగానే

తిరిగి ఆయన కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆ ఫొటోని చేతిలోకి తీసుకున్నారు. ఆయన మనసెంత గందరగోళంగా వుంది.

''పెద్ద కొడుకు కొద్దో గొప్ప చదువుకున్నాడు. ఏదో విధంగా ఇవాళ కాకపోయినా రేపయినా వాడి బతుకు వాడు చూస్కోగలడు. చిన్నవాడు జులాయివెధవ కాబట్టి దేశం మీద పడి బతగలడు. కాని రమ? ఒకవేళ తను చచ్చిపోతే రమ భవిష్యత్తు అసలే అమాయకపు పిల్ల. మాయ మాటల్తో ఎవరో ఒకళ్ళు వంచిస్తారు. లొంగకపోతే బలవంతాన్నైనా పతనం చేస్తారు. నేను, చావను. కనీసం దానికొక భవిష్యత్తు చూపించే వరకైనా నేను చావను.' రమ ఫొటోని గుండెలకు హత్తుకుంటూ తిరిగి బెంచిమీద కూలబడ్డారు నిరంజనం గారు.

***

చీకట్ని కొద్దికొద్దిగా మింగుతూ వెలుగు వస్తోంది. నిద్రలేతో శివరావుకి కళ్ళు ఎర్రబడ్డాయి. కడుపులోకి రాత్రంతా ఏమీ పడకపోవడంతో పేగులు అరుస్తున్నై. అయినా శివరావు ఇంటికి వెళ్ళాలనిపించడం లేదు.

''లెక్క ఎక్కడో తప్పుంటుంది. అందుకే'' జీరో-టు రావాల్సింది, జీరో-సెవెన్ వచ్చింది. ఛీ... ఛీ.. గొణుకున్నాడు శివరావు.

అతని మనసంతా చిందరవందరగా వుంది. ఇంటికి వెళ్ళటానికి బుద్ధి పుట్టడం లేదు. అక్కడే కూర్చోటానికి బుద్ధి పుట్టడం లేదు. దాదాపు రెండు గంటల నుంచి అతని మనసు పెండ్యులమ్‌లా కొట్టుకుంటోంది.

''బెజవాడ వెళ్ళిపోతే...' ఈ ఆలోచన రాగానే శివరావుకి సత్యమూర్తి గుర్తుకొచ్చాడు. ''చదువుకున్న వాళ్ళకే ఉద్యోగాలు లేకపోతే నాకెవడిస్తాడు? అన్నయ్య రాత్రి వచ్చుంటాడు బెజవాడ్నించి. ఏమైందో ఈసారి ఇంటర్వ్యూ? ఏమవుతుంది? మామూలే! ఇరవైరూపాయలూ తగలేసి తిరిగొచ్చుంటాడు' అతని మనసులో ఏదో కొత్తభావం తక్కుమంది.

''అన్నయ్య వుద్యోగాన్వేషణలో తిరుగుతూంటే ప్రతి ఇంటర్వ్యూకు నాన్న డబ్బులిచ్చి పంపడం లేదూ? అట్లాగే అయిదు రూపాయలు నేను వాడుకున్నాను. ఇది ఇంటర్వ్యూలాంటిదే. ఇంటర్వ్యూకెళ్ళిన ప్రతి ఉద్యోగమూ వస్తుందా. అట్లాగే కట్టిన ప్రతిసారీ రాపోవచ్చు. నా తాపత్రయం మాత్రం కుటుంబం కోసం కాదూ? అటువంటప్పుడు నేనెందుకు భయపడాలి? నాన్న ఏమో అంటే ఊరుకుంటానా?'' అనుకున్నాడు. ఈ నిశ్చయానికి రాగానే ఇంటికి బయలుదేరాడు.

శివరావు ఇంటికి జేరేసరికి రమ వాకిలి వూడుస్తోంది.

ఆమెని చూడగానే, 'ఛీ, నాలాంటి పుటక పుట్టేకన్నా ఆడపిల్లగా పుట్టినా బాగుండు. తీసుకొచ్చిందేదో వండి పడేస్తుంటారు. సంపాదించాలనే బాధ వాళ్ళకుండదు' అనుకున్నాడు.

అతని కళ్ళు భయంగా తండ్రి కోసం వెదికాయి. నిరంజనం గారు బావి పళ్ళెంలో కూర్చుని పళ్ళు తోముకుంటున్నారు. నిశ్చలంగా పళ్ళు తోముకుంటున్న ఆయన్ని చూడగానే శివరావుకి వళ్ళు మండింది.

''నిశ్చింతగా యెట్లా పళ్ళు తోముకుంటున్నాడో చూడు! ఇరవై సంవత్సరాలు దాటినా కూతురికి పెళ్ళి చేయాలనే ధ్యాసేలేదు. మరో రెండు నెలల్లో శుభ్రంగా రిటైర్ అయి కూర్చుంటాడు. నా జీవితాన్ని సర్వనాశనం చేశాడు. వున్న పొలం కాస్తా అమ్మి అన్నయ్యని చదివించాడు. నన్ను మాత్రం చదివించలేనని కాళ్ళు బారజాపాడు. నేనేమీ అన్నయ్యలాంటి అసమర్థుడ్నిగాను, చదివించి వుంటే శుభ్రంగా ఈపాటికి ఏదో వొక వుద్యోగాన్ని సంపాదించుకునేవాడ్ని, నన్ను నాశనం చేశాడు'' శివరావు వాళ్ళిద్దర్లో ఎవర్నీ పల్కరించాలని ప్రయత్నించలేదు. కోపంతో శివరావు ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

ఇంట్లో, చాపమీద పడుకున్న సత్యమూర్తిని చూడగానే శివరావు కోపం తారాస్థాయికి జేరుకుంది.

'చదువు పేరుతో వున్న కాస్త పొలం మింగాడు. ప్రతి నెలా ఇంటర్వ్యూల పేర్లతో వూళ్ళన్నీ చుట్టేసి వస్తున్నాడు. ఉద్యోగమూ లేదు. సద్యోగమూ లేదు. రెండు నెలల్లో నాన్న రిటైర్ అయిపోతున్నాడనే విషయం తెలియదా? రమ పెళ్ళికెదిగి గుండెల మీద కుంపటిలా వుందని తెలియదా? ఛీ.. ఛీ... ఏ విషయమూ పట్టించుకోకుండా తిరగటానికి సిగ్గూ లేదూ వెధవ జన్మ!' శివరావుకి సత్యమూర్తి కాళ్ళు పుచ్చుకుని బరబరా బయటికి లాగాలనిపించింది. కాని బలవంతాన తమాయించుకున్నాడు.

'ఈ ఇంట్లో వున్న వాళ్ళంతా బాధ్యత లేని మనుషులు. కుటుంబ పరిస్థితుల గురించి ఎవ్వరూ ఆలోచించరు. వీళ్ళెవ్వరికీ లేని బాధ నాకెందుకు?' తనూ ఒక చాప పర్చుకుని, దానిమీద ముసుగు తన్ని పడుకున్నాడు శివరావు.

***

ఇది ఒక్క రాత్రిలో జరిగిన కథేగాని, ఒక్క రాత్రికే సంబంధించిన కథ మాత్రం కాదు. కొద్దో గొప్పో మార్పులతో నిరంజనం మాష్టారి కుటుంబం ఇటువంటి రాత్రుల ఇంతకు ముందెన్నో చూసింది, ఇక ముందు చూడబోతోంది కూడా, అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ వాళ్ళ జీవితాలలో మార్పనేది వుండదేమో!

*




## తమన్నాకు సవతి పోరు...

తమన్నాకు పెళ్ళి కాకుండానే సవతిపోరు ఏమిటా? అని ఆశ్చర్యపోకండి. తమన్నా, సూర్య సోదరుడు కార్తీ త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నారన్న పుకార్లు జోరుగా షికారు చేస్తున్న సంగతి తెలిసిందే! నిన్న మొన్నటి దాకా తమన్నాను నెత్తిన పెట్టుకు తిరిగిన కార్తీ ఇప్పుడు ఆమెను కొద్దిగా పక్కకు పెట్టాడని కోలీవుడ్ వర్గాలు అంటున్నాయి. కాజల్‌ని అవసరం ఉన్నా లేకపోయినా ఇంటర్వ్యూలలో బహిరంగంగా తెగ పొగుడుతుండడమే ఈ వార్తలకు బలం. ఇటీవల తమన్నా, కాజల్, కార్తీ కలిసి ఓ తమిళ సినిమాలో నటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్తీ 'కాజల్ కళ్ళు తమన్నా కళ్ళ కన్నా పెద్దవనీ, అలాగే తమన్నా కన్నా కాజల్ బాగా పొడగరి అని పరోక్షంగా పొగిడాడట!' ఇది విన్నప్పటినుంచీ కాజల్ సంగతి ఎలా ఉన్నా తమన్నాకు పాపం నిద్ర కరువైందట!